క్లుప్తంగా

షాద్‌నగర్ పట్టణ సీఐగా విజయ్‌కుమార్



షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పట్టణ నూతన సీఐగా విజయ్‌కుమార్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండురోజుల క్రితం పట్టణ సీఐగా పనిచేసిన ప్రతాప్‌లింగంను వీఆర్‌లో ఉంచారు. ఆయన స్థానంలో మేడ్చెల్ జోన్‌లో పనిచేసిన కేతూరి నర్సింహాను పట్టణ సీఐగా నియమిస్తూ సైబరాబాద్ సీపీ మహంతీ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా కేతూరి నర్సింహా స్థానంలో సైబరాబాద్ కమిషనరేట్ ఎలక్షన్ సెల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను షాద్‌నగర్ పట్టణ సీఐగా నియమించారు.

వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు స్వాగతం పలుకుతున్న రామ్మోహన్‌రెడ్డి

చేవెళ్ల: బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కలిశారు. రెండ్రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదివారం డీసీసీ అధ్యక్షుడు రాంమోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీలోకి వచ్చినందుకు కాలె యాదయ్యకు సన్మానించి స్వాగతం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కలిసి పనిచేస్తూ నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేద్దామని వారు చెప్పారన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

షాద్‌నగర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బుగ్గారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పట్టణానికి ఎంతో మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్య కోసం వస్తుంటారని, వారి కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ కనబరచాలని, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుడు అనురాగ్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నగరంలోని నానల్‌నగర్‌లో ఉన్న ప్రీమియర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సురంగల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, గౌతంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విజయలక్ష్మి, నర్సింహారెడ్డి, లక్ష్మయ్య, రంగారెడ్డి, కిష్టయ్య, నర్సింహా, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విశాల

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన చిర్ర మహేశ్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఎల్లప్పుడూ మహేశ్ కుటుంబానికి అండగా ఉంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం.. హిమాయత్‌నగర్ పాఠశాల

- ఆకర్షణీయంగా సర్కారు బడి
- కార్పొరేట్‌కు దీటుగా సకల సౌకర్యాలు
- పెరిగిన విద్యార్థుల సంఖ్య



విద్యార్థులతో కళకళలాడుతున్న ప్రాథమిక పాఠశాల



కొత్త రంగులతో పాఠశాల భవనం



క్రీడా సామగ్రి పక్కనే తాగునీటి నల్లా ఏర్పాటు

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాల కొత్త రంగులు, సకల సౌకర్యాలతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని హంగులతో అభివృద్ధి పనులను నిర్వహించారు. 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వంతో పాటు యూనైటెడ్ ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సహకారం అందించడంతో పాఠశాల అన్ని హంగులతో ఆకర్షణీయంగా తయారై ఆదర్శంగా నిలుస్తోంది. ముఖ్యంగా పాఠశాల గేటుతో పాటు బోర్డు ఏర్పాటు, పాఠశాల గదులన్నింటికీ రంగులు వేయడం, కొత్త బొమ్మలు, చిత్రాలు గీయడంతో పాటు విద్యార్థులు కూర్చునేందుకు రంగు రంగుల బెంచీలు, బ్లాక్ బోర్డులు ఇవే కాకుండా విద్యార్థులు ఆడుకునేందుకు ఆట సామగ్రి, తాగునీరు, నల్లాలు, పాఠశాలలో ఫ్యాన్‌లు, లైట్లు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేశారు. దీంతో హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులతో పాటు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు 184 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ సంవత్సరం కొత్తగా బడీడు పిల్లలను 47 మందిని చేర్పించామని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పాఠశాలలు పునఃప్రారంభంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఘణనీయంగా పెరగడంతో కళకళలాడుతోంది. ప్రభుత్వ నిధులు, యూనైటెడ్ ఆఫ్ హైదరాబాద్ సహకారంతో పాఠశాలలో నిర్వహించిన అన్ని వసతులు పిల్లలకు, పిల్లల తల్లిదండ్రులకు ఆకర్షణీయంగా కనబరుస్తోంది. హిమాయత్‌నగర్ గ్రామంలో రోడ్డు పక్కనే ఈ ప్రాథమిక పాఠశాల ఉండడం అటూ ఇటూ వెళ్లే వివిధ ప్రాంతాల ప్రజలు ఈ పాఠశాలను చూస్తూ ఆనందిస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగింది.

అన్ని ఏర్పాట్లు చేశాం



విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాల పునఃప్రారంభంతోనే అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా బడీడు పిల్లలను ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలకు పంపించాలని కోరాం. ఉపాధ్యాయులందరూ కూడా పాఠశాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కళకళలాడుతోంది.

–ఉషగోని రాములు, హెచ్‌ఎం

యజమానుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం

టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్

షాద్‌నగర్: పరిశ్రమ యజమానుల నిర్లక్ష్యం కారణంగానే పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిందని, బాధిత కార్మిక కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ.. సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ఐదుగురు కార్మికులు మృత్యువాత పడటం దురదృష్టకరమన్నారు. పేలుడు ఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు సరైన రీతిలో చర్యలు తీసుకోవడం లేదన్నారు. బాధిత కార్మిక కుటుంబాలకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నందిగామ: మండల పరిధిలోని బండోనిగూడలో గత 15 రోజులుగా నిర్వహించిన బండోనిగూడ ప్రీమియర్ లీగ్(బీపీఎల్) క్రికెట్ టోర్నమెంటు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఫైనల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్, హైదరాబాద్ సన్‌రైజర్స్ తలపడగా చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. దీంతో గ్రామ పెద్దలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్, పసుల బుచ్చయ్య, బండ మల్లేశ్, పాండు, మంకాల శ్రీశైలం, సాములయ్య, నర్సింహులు, రాజు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చేవెళ్ల: మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గ్రామ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించారు. అనంతరం వారు చిన్నప్పటి స్నేహితులతో కలిసి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్



హరీశ్‌రావును సన్మానిస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

తలకొండపల్లి: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఆయన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హైదరాబాద్‌లోని నివాసంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితిని హరీశ్‌రావు అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధిక స్థానాలు గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీపీ తిర్మణి నిర్మలా శ్రీశైలంగౌడ్, కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, బుచ్చిబాబు, కోటేశ్, నరేశ్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



టీవీలో మోదీ ప్రసంగాన్ని వింటున్న ఓ కుటుంబం

కేశంపేట: దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమవుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు రొల్ల రాఘురాంగౌడ్ అన్నారు. బీజేపీ నాయకులు, ప్రజలతో కలిసి మండల పరిధిలోని లింగంధన గ్రామంలో మాన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందదర్భంగా రొల్ల రఘురాంగౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా నిర్వహించిన మాన్‌కీబాత్ కార్యక్రమంలో భాగస్వాములవడం ఆనందంగా ఉందన్నారు. మాన్‌కీబాత్ కార్యక్రమంలో మోదీ తన మనసులోని మాటలను ప్రజలతో పంచుకున్నారన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు రాధిక, శక్తి కేంద్ర ఇన్‌చార్జి రమేశ్, బూత్ అధ్యక్షులు వెంకటేశ్వరి, అంజయ్య, సువర్ణ, అరుణమ్మ, మంగమ్మ, వనజబాయి, స్వప్నిక తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ప్రభుదయాల్ దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాబాద్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని విశ్రాంత ఉపాధ్యాయులు బర్కు నర్సింహులు, రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌గూడలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో షామీర్‌పేట్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు ప్రభుదయాల్ పదవీ విరమణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ప్రభుదయాల్ చాలా రోజులు పనిచేయడంతో పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులే కీలకం అని, విద్యార్థులను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందన్నారు. ప్రభుదయాల్ ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పాటు వృత్తిపై గౌరవంతో పని చేశారని గుర్తుచేశారు. ప్రభుదయాల్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు నన్ను ఇంత దూరం పిలిచి సన్మానించడం గర్వంగా ఉందన్నారు. నా జీవితంలో ఈ సన్మానం గుర్తుండి పోతుందని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, జంగయ్య, శేఖర్, ఇస్మాయిల్, రాజశేఖర్‌రెడ్డి, కుమార్, పరమేశ్, అమృత తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని చిలకమర్రి గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీశైలం ఇంటి నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిల్కమర్రి రవీందర్‌రెడ్డి రూ.20వేల ఆర్థికసా యం అందజేశారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును కుమ్మరి శ్రీశైలంకు అందజేశారు. నిరుపేదలకు చేయూతనివ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బాబర్‌ఖాన్, రాయికల్ శ్రీనివాస్, గురువేందర్, తుపాకుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా రాజు



నియామకపత్రం అందుకుంటున్న రాజు పటేల్

బడంగ్‌పేట్: బీఆర్‌ఎస్ మీర్‌పేట్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా నందిహిల్స్‌కు చెందిన సింగం రాజు పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు పటేల్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే, పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కాలనీవాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటేదెందుకు.. నరికేదెందుకు?

- నాటిన చెట్లను నరికేస్తున్న వైనం
- అధికారులు, పాలకుల అవగాహన లోపమే కారణమా?
- ఈ ఏడాదైన తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికుల విన్నపం





ముట్పూర్‌లో నరికివేసిన చెట్లు

కొందుర్గు: ఇటు అధికారులు, అటు పాలకుల అవగాహన లోపంతో ప్రజల సొమ్ము దుర్వినియోగం అవుతోంది. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి నాటిన చెట్లను నరికివేస్తున్నారు. ఇది మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తెలంగాణాకు హరితహారం పేరుతో గ్రామాల్లో నాటుతున్న మొక్కల పరిస్థితి. ప్రభుత్వం హరితహారం పేరుతో గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటిస్తోంది. ప్రతి ఏటా ప్రతి గ్రామంలో వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. కానీ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో నాటిన కొన్నాళ్లకే నరుకుతున్నారు. ప్రతి గ్రామంలో లక్షలు ఖర్చుచేసి నర్సరీలు పెంచుతున్నారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలను నాటుతున్నారు. గతేడాది ప్రతీ గ్రామ పంచాయతీకి 10వేల మొక్కలు పెంచారు. కానీ మొక్కలు నాటడంలో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి అవి ఏపుగా పెరిగేందుకు డబ్బులు ఖర్చుచేసి కంచెలు వేయడం, నీళ్లు పోయడం వంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ కరెంట్ స్తంభాల కింద, పైపులైన్ వేసే ప్రాంతంలో మొక్కలు నాటడంతో ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యం

మదర్ డెయిరీ కుర్మిద్ద చైర్మన్ మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న మేనేజర్ కరుణాకర్‌రెడ్డి

యాచారం: నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం గ్రామ పాలక వర్గ సమావేశం కుర్మిద్దలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మేనేజర్ కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం కుర్మిద్ద పాలకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బందె మహేందర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులుగా శ్రీనివాస్ యాదవ్, భాగ్యమ్మ, మంగమ్మ, అంజయ్య, సంజీవ, నర్సింహారెడ్డి, జగన్, నర్సింహ, జంగయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదేళ్లుగా చైర్మన్‌గా ఎన్నుకుంటున్నందుకు రైతులకు ధన్యావాదాలు తెలిపారు. రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా సంఘం పని చేస్తుందన్నారు.